సా...గుతున్న సర్వే!

- ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో సంకేతిక సమస్యలు
- జహీరాబాద్ నియోజకవర్గంలో 61.63 శాతం సర్వే పూర్తి
- ఈ నెల 31 గడువు నాటికి పూర్తి కష్టమే..
- సర్వేలో సమస్యలు.. లబ్ధిదారుల్లో ఆందోళన
- పేదలకు సొంతింటి కల సాకారమయ్యేనా!

న్యాల్‌కల్ మండలం రామతీర్థం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపడుతున్న అధికారులు, సిబ్బంది

జహీరాబాద్, డిసెంబర్ 29: ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సంకేతిక సమస్యలు తలెత్తడంతో ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేసేందుకు సంబంధిత సర్వే అధికారులకు కష్టంగా మారింది. జహీరాబాద్ నియోజకవర్గంలో ఈ నెల 10వ తేదీ నుంచి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు సంబంధిత అధికారులు ఇంటింటి సర్వేను చేపట్టారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసిన వివరాలు ప్రత్యేక యాప్‌లో వస్తుండగా వాటి ఆధారంగానే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రత్యేక యాప్ సర్వర్ ఇబ్బంది పెడుతుండడంతో ఇండ్ల సర్వే నియోజకవర్గంలో నత్తనడకన సాగుతున్నది. సంబంధిత అధికారులు ఇంటింటా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతున్నది.

నియోజకవర్గంలో 75,835 దరఖాస్తులు

నియోజకవర్గంలోని జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాలతోపాటు జహీరాబాద్ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 75,835 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని సర్వే చేసేందుకు 196 మందిని నియమించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి 3500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఆదివారం నాటిని 44,816 దరఖాస్తుల వివరాలను సేకరించారు. మొత్తానికి జహీరాబాద్ నియోజకవర్గంలో 61.63 శాతం సర్వే పూర్తయింది. ఒక్కో ఇంటి వద్ద కనీసం ఆరగంట సమయం పడుతున్నదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రత్యేక యాప్ సర్వర్ ఇబ్బందితో మరికొందరికి లాగిన్ కాకపోవడంతో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న యాప్‌లో లబ్ధిదారుల వివరాలు చూపించడం లేదు. దరఖాస్తులు కంప్యూటీకరణ చేసే సమయంలో సరైన విధంగా వివరాలను నమోదు చేయకపోవడం ఇబ్బందిగా మారింది. లబ్ధిదారుల వృత్తి విషయంలో యాప్‌లో వ్యవసాయ కూలీ, కూలీ లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తున్నది. మున్సిపలిటీ పరిధిలో సమాచారమివ్వకుండానే ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ వీధిలో సర్వే చేస్తున్నారో చెప్పడం లేదని చెబుతున్నారు.

ముందు స్థలం ఉన్న వారికే!

ఇందిరమ్మ ఇండ్ల ప్రత్యేక యాప్‌లో ఇంటి స్థలం ఉండి, ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సాయం, ఇల్లు కావాలి అని రెండు ఆప్షన్లు చూపిస్తున్నది. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, నంబర్‌తోపాటు గతంలో ప్రభుత్వం నుంచి ఇల్లు పొందారా.. లేదా.?, ఇంటి నిర్మాణానికి స్థలం ఉందా, తదుపరి వివరాలతోపాటు ఇంటి ఎదుట లబ్ధిదారుడి ఫొటో, ఇంటి పైకప్పు, ఇంటి లోపల గదుల చిత్రాలు, ఇలా మూడు రకాలుగా తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. మొదట దేనికి ప్రాధాన్యం ఇస్తారో తెలియకపోగా, ప్రభుత్వం మాత్రం ముందుగా స్థలమున్న వారికే ఆర్థికసాయం అందిస్తామని చెబుతోంది.

సర్వే సిబ్బంది ఎప్పుడొస్తున్నారో!

అద్దె ఇండ్లలో ఉన్న వారు ఇల్లు మారితే సర్వే సిబ్బంది సమాచారం ఇవ్వడం లేదు. పనులకు వెళ్లిన సమయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది వస్తున్నారు. అనుకూల సమయంలో రావాలని కోరుతున్నా.. సర్వే సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 31వ తేదీలోగా సర్వే పూర్తిచేయాలని జిల్లా అధికారులు ఆదేశించినా.. ఇప్పటివరకు సగం వరకు పూర్తయింది. సంబంధిత సర్వే అధికారులు, సిబ్బంది ఇండ్లు ఎక్కువగా ఉండడంతోపాటు సర్వర్ ఇబ్బందితో యాప్‌లు పనిచేయకపోవడం వల్ల సర్వే సక్రమంగా ముందుకు సాగడం లేదు. సర్వే గడువులోగా పూర్తి కావడం కష్టమని సంబంధిత అధికారులు, పర్యవేక్షణ అధికారులు చెబుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తయిన తర్వాత ఇందిరమ్మ కమిటీల ఆమోదంతో ఇండ్లు మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గంలో భారీగా దరఖాస్తులు రావడంతో ప్రభుత్వం మొదటివిడతలో నియోజకవర్గానికి 3,500 మంజూరు చేయడంతో తమ పేరు అందులో ఉంటుందో, లేదో? అని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

నేడు మున్సిపాలిటీ వద్దని ఆందోళన

గుమ్మడిదల, డిసెంబర్ 29: మున్సిపాలిటీ ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని గ్రామస్తులు ఆందోళన చేయనున్నట్లు అఖిలపక్ష పార్టీ నాయకులు వెల్లడించారు. మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన అఖిలపక్ష పార్టీల నాయకులు, మాజీ సర్పంచ్‌లు సురభినాగేందర్ గౌడ్, ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు సద్ది విజయభాస్కర్‌రెడ్డితో పాటు పలు నాయకులు సోమవారం బొంతపల్లి కమాన్‌వద్ద ఉదయం జాతీయ రహదారిపై ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఈ ధర్నా, ఆందోళనకు మండలంలోని దోమడుగు, అన్నారం, గుమ్మడిదల, వీరన్నగూడెం గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలకు అధిక సంఖ్యలో హాజరై మున్సిపాలిటీ వద్దని చేపట్టే ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

జహీరాబాద్, డిసెంబర్ 29: జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి శివారులోని ముంబాయి-హైదరాబాద్ జాతీయ రహదారి- 65పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బూచినెల్లి గ్రామ శివారులోని ఓం లాజిస్టిక్ సమీపంలో రహదారిపై గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి(35)ని ఢీకొట్టాడు. దీంతో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పంచాయతీ కార్యదర్శి అంబిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూంగొండేశ్వర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

భూంగొండేశ్వర్ బోధనలు అనుసరణీయం

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబర్ 29: భూంగొండేశ్వర్ బోధనలు అనుసరణీయమని, తన బోధనలతో సమాజంలో చైతన్యం నింపిన మహనీయుడు భూంగొండేశ్వర్ అని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలోని భూంగొండేశ్వర్ విగ్రహ ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ భూంగొండేశ్వర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కిష్టయ్య మాస్టర్, నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మల్‌గొండ, బీఆర్ఎస్ నాగల్‌గిద్ద మండల అధ్యక్షుడు సంజీవ్‌కుమార్, నాయకులు గోపాల్, జైపాల్, సంతోష్, భూమయ్య, సతీష్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

నారాయణఖేడ్ మండలం జూకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మూఢ ప్రభాకర్ అనారోగ్యం కారణంగా చికిత్స పొందగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆయనను కలుసుకొని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కిష్టయ్య మాస్టర్, రవీందర్‌నాయక్, వెంకటేశం, మల్‌గొండ, సాయిలు, జగదీశ్వర్, నవీన్‌కుమార్, సురేశ్, సంగమేశ్వర్‌స్వామి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

మోతీమాత ఆలయ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్, డిసెంబర్ 29: మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో మోతీమాత ఆలయ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడిగా కేషుసింగ్ రాథోడ్ కోరారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కిషన్ పవర్, ఆలయ కమిటీ అధ్యక్షుడిగా కేషుసింగ్ రాథోడ్, ఉపాధ్యక్షులుగా నారాయణ జాదవ్, ప్రధాన కార్యదర్శిగా పవన్‌రాథోడ్, ఆసోసియేట్ అధ్యక్షులుగా శంకర్ పవర్ తదితరులను ఎన్నుకున్నారు. ఆనంతరం మోతీమాత జాతర ఉత్సవాల ఏర్పాట్లపై కమిటీ సభ్యులు సమీక్ష నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కేషుసింగ్ రాథోడ్ మాట్లాడుతూ జనవరి 12న అమ్మవారికి కుంకుమార్చన, భోగ్‌బండార్, హారతి తదితర ప్రత్యేక పూజలు, 13న భవానీమాతకు మేకల బలిదానం, 14న అమ్మవారికి ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందని తెలిపారు. ఏటా నిర్వహించే జాతరకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున్న తరలివస్తారని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులను టీబీఈఎస్ఎస్, బీఆర్ఎస్ బంజారా నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీబీఈఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తులసీరామ్‌రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రురాథోడ్, నానుసింగ్ రాథోడ్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ చవాన్, జహీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు తుకారం చవాన్, గౌరవ అధ్యక్షుడు హీరు రాథోడ్, బీఆర్ఎస్ బంజారా నాయకులు గోపాల్ బానోత్, సంజీవ్ పవార్, లాల్‌రాథోడ్, హరి, రాంశెట్టి, చందా జాదవ్, ఖీరు, దేవిదాస్ జాదవ్, శేఖర్, గోపాల్‌జాదవ్, వాచునాయక్, చందర్, జితేందర్ పాల్గొన్నారు.

సందడిగా అపూర్వ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బొల్లారం, డిసెంబర్ 29: బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-02 పదోతరగతి బ్యాచ్‌తోపాటు 2005-06కు చెందిన మరో బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు దేవయ్య, జయలక్ష్మి, మణి, బుచ్చిరెడ్డి, మోహన్ రెడ్డి, రమీలాదేవిలకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సందడిగా గడిపారు.

గోరక్షణతో ప్రపంచ శాంతి

అమీన్‌పూర్, డిసెంబర్ 29: గోమాతను రక్షిస్తే ప్రపంచ శాంతి చేకూరుతుందని అయోధ్య రామ మందిర్ ట్రస్ట్ కోశాధికారి గోవింద దేవగిరి జీ మహారాజ్ అన్నారు. ఆదివారం బీరంగూడలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి గోశాల 14వ వార్షికోత్సవానికి ఎంపీ రఘునందన్ రావుతో కలిసి హాజరయ్యారు. ఉదయం గోమాత పూజ, శాంతి హోమం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సంపదను రక్షించేందుకు కృషి చేయాలని కోరారు. బీరంగూడ గోశాలలో సుమారు 1,200 ఆవులను సంరక్షించడం అభినందనీయమన్నారు.

అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధుల ఆరా

బొల్లారం, డిసెంబర్ 29: మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి వేర్వేరుగా పర్యటించి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బస్తీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులపై వారు ఆరా తీశారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడ నాణ్యత లోపించవద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్ణీత సమయంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వార్డులో నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, శారద, భాస్కర్, బస్తీ మహిళలు పాల్గొన్నారు.

బీరప్ప బస్తీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి

జనవరి 10 నుంచి జిల్లా స్థాయి క్రీడాపోటీలు

గుమ్మడిదలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, డిసెంబర్ 29: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆట స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ జనవరి 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లా స్థాయి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో కబడ్డీ, వాలీబాల్ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ క్రీడోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేల నగదు పారితోషికంతో ట్రోఫీలు బహూకరించనున్నట్లు తెలిపారు. వీరితోపాటు బీఆర్ఎస్ నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సీజీఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్‌రెడ్డి, నాయకులు కాలకంటి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరహరి, దేవేందర్‌రెడ్డి, పోచుగారి శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, కోచ్‌లు కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతినగర్ కాలనీ అధ్యక్షుడిగా అంజిరెడ్డి

పటాన్‌చెరు, డిసెంబర్ 29: పటాన్‌చెరు పట్టణం శాంతినగర్, శ్రీనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొండకల్ అంజిరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని మంజీరా స్కూల్‌లో శ్రీనగర్‌కాలనీ, శాంతినగర్ కాలనీల పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అంజిరెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడు మాట్లాడుతూ శాంతినగర్, శ్రీనగర్ కాలనీ వాసులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాయికాడి విజయ్‌కుమార్, కాలనీ పెద్దలు రాజిరెడ్డి, టప్పకుమార్, సంజీవరెడ్డి, వాజిద్ అలీ, అడ్వకేట్ నర్సింహా, శ్రీనివాస్‌గుప్త, లడ్డు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు తక్షణసాయం అందజేత

తక్షణసాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, డిసెంబర్ 29: పేద వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందడంతో బీఆర్ఎస్ నాయకుడు అంత్యక్రియల నిమిత్తం తక్షణసాయం అందించారు. ఆదివారం మండలంలోని కానుకుంట గ్రామానికి చెందిన తుడుమె ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం బీఆర్ఎస్ కార్యకర్తలతో రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. నాయకులు గుండగళ్ల వెంకటేశ్, పోతరాజు పోచయ్య, బాల్‌రెడ్డి, యాదగిరి, ఎర్రోళ్ల శంకర్, తుడుం ప్రభాకర్, నర్సింగ్‌రావు, మురళి, రాజు, పెద్దులు, సుధాకర్ ఉన్నారు.

ఏకగ్రీవంగా ట్రెసా జిల్లా కమిటీ ఎన్నిక



నూతన జిల్లా కమిటీని సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 29: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా ట్రెసా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ట్రెసా కార్యాలయంలో రాష్ట్ర కోఆర్డినేటర్ నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ట్రెసా అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. జిల్లా నూతన కమిటీని ఈ సందర్భంగా అభినందించారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పని చేయాలని సూచించారు. రెవెన్యూ వ్యవస్థలో ఎన్ని సంఘాలు వచ్చినా ట్రెసా మాత్రమే నిలబడి పని చేస్తున్నదన్నారు. ట్రెసా కృషి ఫలితంగా జూనియర్ అసిస్టెంట్లు సీనియర్లుగా, సీనియర్ అసిస్టెంట్ నుంచి నాయబ్ తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ నుంచి తహసీల్దార్, తహసీల్దార్ నుంచి డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతులు వచ్చాయని తెలిపారు. ట్రెసా సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ జిల్లా అధ్యక్షుడిగా కె.గంగాధర్ రావు, కార్యదర్శిగా ఎం.కిరణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.దశరథ్, కోశాధికారిగా పి.బాలరాజుతోపాటు మొత్తం 23 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నికల అధికారి నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్ల నుంచి రెవెన్యూ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కర్రసాములో శ్రీవల్లికి సిల్వర్

రామచంద్రాపురం, డిసెంబర్ 29: జాతీయస్థాయి కర్రసాము పోటీల్లో ఆర్సీపురానికి చెందిన ఆలూరి శ్రీవల్లి సిల్వర్ మెడల్ సాధించింది. పాండిచ్చేరిలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి కర్రసాము పోటీల్లో స్థానికంగా ఉన్న డిల్లీ వరల్డ్ స్కూల్ నుంచి శ్రీవల్లి పాల్గొని రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుంది. ఆదివారం శ్రీవల్లి తండ్రి ఆలూరిగోవింద్ మాట్లాడుతూ జాతీయస్థాయి కర్రసాములో తన కూతురు మెడల్ సాధించడం సంతోషంగా ఉన్నదని తెలిపారు. శ్రీవల్లి జాతీయ స్థాయిలో మెడల్ సాధించడంతో స్కూల్ మేనేజ్‌మెంట్, కుటుంబసభ్యులు, కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

జహీరాబాద్, డిసెంబర్ 29: మండల స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆదివారం జహీరాబాద్ విలాసిటీ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రమేశ్ బహుమతులు అందజేశారు. ఇటీవల నిర్వహించిన గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని విలాసిటీ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న విలాసిటీ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రమేశ్

పొలాల్లో ఉత్తరాది కూలీలు

జిల్లాలో యాసంగి జోరందుకున్నది. రైతులను కూలీల కొరత వెంటాడుతున్నది. ఇక్కడ కూలీలు దొరక్క ఉత్తర భారతం నుంచి వచ్చిన వారితో నాట్లు వేయిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, బీహారు రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ కూలీలు గుత్తకు మాట్లాడుకొని నాట్లు వేస్తున్నారు. ఆదివారం చౌటకూర్ గ్రామ శివారులో యూపీకి చెందిన కూలీలు నాట్లు వేస్తుండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించింది.

- నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి, డిసెంబర్ 29

వైద్య శిబిరానికి స్పందన

బొల్లారం, డిసెంబర్ 29: జిన్నారం మండలం మాదారం గ్రామంలో మధుకర దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సాధారణ వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు దవాఖాన యాజమాన్యం ముందుకురావడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామస్తులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గణేష్, రాజుగౌడ్, భగవాన్‌సింగ్, మల్లేశ్, భాస్కర్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

దిగివచ్చిన టమాటా..

గుమ్మడిదలలో కోయకుండానే పొలంలోనే వదిలేసిన టమాటా పంట

గుమ్మడిదలలో రూ.10కి కిలో టమాటా విక్రయిస్తున్న రైతు

- 25 కిలోల బాక్స్ రూ.200 నుంచి రూ.250
- గిట్టుబాటు కాక నష్టపోతున్న టమాటా రైతులు
- పంటను పొలంలోనే వదిలేస్తున్న వైనం

గుమ్మడిదల, డిసెంబర్ 29: కొన్ని నెలల క్రితం టమాటా కిలో ధర రూ.100 పలికింది. అప్పుడు ఈ పంట సాగు చేసిన రైతులకు కాసులు కురిపించింది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 25 కిలోల టమాటా బాక్స్ రూ.1,000 నుంచి రూ.1,200 వరకు ధర పలికింది. ప్రస్తుతం 25 కిలోల టమాట బాక్స్ రూ.200 నుంచి రూ.250 వరకు మాత్రమే పలుకుతుండడంతో రైతుల పరిస్థితి తారుమారైంది. పంటను సమీపంలోని హైదరాబాద్-సికింద్రాబాద్ మార్కెట్‌కు తరలించాలంటే రవాణా, కోతకు కూలీల ఖర్చులు రాకపోవడంతో పంటను పొలాల్లోనే వదిలివేస్తున్నారు. సాగుకు చేసిన ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం శుభకార్యాలు సైతం తక్కువగా ఉండడంతో కొనుగోళ్లు లేక ధరలు అమాంతం పడిపోయాయి. టమాటా మార్కెట్లోకి అధికంగా చేరడంతో చిరువ్యాపారులు సైతం నష్టపోతున్నారు. మండల పరిధిలోని గుమ్మడిదల గ్రామంతోపాటు కానుకుంట, మంభాపూర్, అనంతారం, కొత్తపల్లి, నల్లవల్లి తదితరగ్రామాల రైతులు అధికంగా టమాటా సాగు చేశారు. ఇక్కడి రైతుకు ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.

మాట్లాడుతున్న మౌలానా సయ్యద్ అజహర్ మదనీ

వక్ఫ్ బిల్లును ఒప్పకోం

జహీరాబాద్, డిసెంబర్ 29: వక్ఫ్ బిల్లును ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని జమాతే హింద్ జాతీయ ప్రతినిధి మౌలానా సయ్యద్ అజహర్ మదనీ స్పష్టం చేశారు. ఆదివారం న్యాల్‌కల్ మండలం హద్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన జనీయత్ హింద్ మహాసభలో పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చాలని వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టేలా చేసే కొన్ని శక్తుల ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. శాంతియుత వాతావరణం ఉన్న చోట కొన్ని విభజన శక్తులు నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. మహమ్మద్ ఫరూక్, మహమ్మద్ జమీర్, మీర్ రాజీయోద్దీన్ మక్సుద్ అలీ, ఖిజర్‌యాఫై పాల్గొన్నారు.